VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 56

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 26 జూలై 2026

## భవిష్యత్తులో వ్యవసాయాభివృద్ధికి సహజ వ్యవసాయమే మార్గం - రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్

**బాపట్ల,కలంకౌంటర్ :** వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను అధిగమించేందుకు శాస్త్రీయ పరిశోధనలు, సుస్థిర వ్యవసాయ విధానాలు, సహజ వ్యవసాయం అత్యంత అవసరమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. శనివారం బాపట్లలోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 58వ వార్షిక స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించిన గవర్నర్, పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, గత ఆరు దశాబ్దాలుగా ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్య, పరిశోధనలు, విస్తరణ సేవల ద్వారా రైతు సమాజానికి, దేశ వ్యవసాయాభివృద్ధికి విశేష సేవలు అందిస్తోందని కొనియాడారు. ఈ స్నాతకోత్సవం విద్యార్థుల కృషి, పట్టుదల, అంకితభావానికి నిదర్శనమని, వారి విజయాల్లో తల్లిదండ్రులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తల పాత్ర కూడా అమూల్యమని పేర్కొన్నారు. ప్రధాన అతిథిగా విచ్చేసిన ఐసీఏఆర్--ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, పూర్వ విద్యార్థి డా. చి. శ్రీనివాసరావును గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. సహజ వనరుల నిర్వహణ, సుస్థిర వ్యవసాయం, వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యవసాయ విధానాల అభివృద్ధిలో ఆయన చేసిన కృషి దేశానికి మార్గదర్శకమని కొనియాడారు. పత్తి సాగు అభివృద్ధికి విశేష సేవలు అందించిన పదవీ విరమణ పొందిన పత్తి శాస్త్రవేత్త కె. రవీంద్రనాథ్‌కు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (హానోరిస్ కాజా) ప్రదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యవసాయం కేవలం ఆర్థిక కార్యకలాపం మాత్రమే కాదని, దేశ సంస్కృతి, ఆహార






భద్రత, సమాజ శ్రేయస్సుకు పునాదిగా నిలుస్తుందని గవర్నర్ అన్నారు. రైతు నాటే ప్రతి విత్తనం ఆశకు ప్రతీక అని, ప్రకృతితో సమన్వయంగా రైతు చేసే శ్రమే దేశాన్ని పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఆలస్యమైన రుతుపవనాలు, వర్షాభావం, అతివృష్టి, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల క్షీణత, నేల సార నష్టం వంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేల ఆరోగ్యం, నీటి వినియోగ సామర్థ్యం, సహజ వనరుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ నినో ప్రభావంతో దేశంలో రుతుపవనాల బలహీనత, కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు వాతావరణ మార్పులను నిరంతరం పర్యవేక్షించి, ప్రభుత్వానికి తగిన సూచనలు చేయడంతో పాటు రైతులకు శాస్త్రీయ సలహాలు అందించాలని సూచించారు. ముఖ్యంగా కరువును తట్టుకునే పంటలు, భూగర్భ జలాల సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమం ద్వారా రాష్ట్రం సహజ వ్యవసాయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందుతున్నారని, నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు నీటి వినియోగం గణనీయంగా తగ్గుతోందని తెలిపారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 100 శాతం సహజ వ్యవసాయ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని ఆయన అభినందించారు. జాతీయ విద్యా విధానం--2020 అమలులో ముందంజలో నిలిచిందని, మెరుగైన పంట రకాల అభివృద్ధి, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, రైతులకు శాస్త్రీయ సేవలందించడంలో విశేష కృషి చేస్తోందని గవర్నర్ ప్రశంసించారు. పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్య అనేది జ్ఞానంతో పాటు బాధ్యతను కూడా అందిస్తుందని అన్నారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని, వారి అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేయాలని సూచించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం చెప్పిన "విజయం శాశ్వతం కాదు, అపజయం అంతిమం కాదు. విజయం తర్వాత కృషిని ఆపవద్దు, అపజయం తర్వాత ప్రయత్నాన్ని మానవద్దు" అనే సందేశాన్ని గుర్తుచేస్తూ, పట్టభద్రులు నిరంతరం శ్రమించి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, భారతరత్న డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ చెప్పిన "వ్యవసాయం కేవలం ఒక వృత్తి కాదు, అది ఒక జీవన విధానం" అనే సందేశాన్ని గుర్తుచేస్తూ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, సుస్థిర వ్యవసాయం దిశగా తమ జ్ఞానాన్ని వినియోగించాలని యువతకు సూచించారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమంలో 50 మందికి డాక్టరేట్ పండితులు, 240 మంది పీజీ విద్యార్థులు, 1385 మంది గ్రాడ్యుయేట్లతోపాటు పథకాలు ప్రతిభ ధృవీకరణ పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఇది పట్టదలకు లభించి విజయం అని ఆయన అన్నారు. ఈ శుభ సందర్భంగా విద్యార్థుల విజయానికి, తల్లిదండ్రుల త్యాగానికి, ఉపకులపతి అధ్యాపకులు

- 2లో

## మీ ఆరోగ్యం... మీ బాధ్యత

- సంజీవనిని సద్వినియోగం చేసుకోండి
- ప్రజారోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నుంచి సంజీవని
- ప్రజారోగ్యం-ప్రజా సంక్షేమం-అభివృద్ధి కూటమి ప్రభుత్వ బాధ్యత
- గొడ్డలి పార్టీ నేతలు పగటి వేషగాళ్లు-ఒక్క ఎకరాకు నీరివ్వలేదు... ఒక్క పరిశ్రమ తీసుకురాలేదు
- ఆస్పరిలో సంజీవని కార్యక్రమం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు





**కర్నూలు జిల్లా/ఆలూరు,కలంకౌంటర్ :** ప్రజారోగ్యం కోసమే సంజీవని పథకాన్ని అందిస్తున్నామని...ఆగస్టు నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మీ ఆరోగ్యం... మీ చేతుల్లో ఉంటుందని... ప్రభుత్వం అందించే సంజీవని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన సంజీవని కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం సాంకేతికతను జోడిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న సంజీవని ప్రాజెక్ట్ ప్రత్యేకతలను సీఎం చంద్రబాబు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విద్య, వైద్యం మీదే ప్రతి కుటుంబం అత్యధికంగా ఖర్చు చేస్తున్న పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే తీసుకునేలా సంజీవని ప్రాజెక్టును రూపొందించామని సీఎం తెలిపారు. ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు కానున్న ఈ కార్యక్రమంలో ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి.. కుటుంబ సభ్యులందరికీ ఆభా హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు.

**ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ ఇదే సంజీవని విధానం..**

ప్రజలు అనారోగ్యానికి గురైన తర్వాత చికిత్స ఇవ్వడమే కాదు.. వ్యాధులు రాక ముందే గుర్తించడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, అవసరమైనప్పుడు సమర్థవంతమైన వైద్యం అందించడమే సంజీవని లక్ష్యమని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు వచ్చాయని.. అలాంటి పరిస్థితులను తగ్గించేందుకు ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు ఆరోగ్యం, బాలల ఆరోగ్య పరీక్షలు, 108 అత్యవసర సేవలు, 104 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఈ-ఔషధి, ల్యాబ్ సేవలను ఒకే డిజిటల్ వ్యవస్థలోకి తీసుకొస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ ఆధారిత వైద్య సహాయం, టెలీమెడిసిన్, రిమోట్ కేర్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్, డిజిటల్ నర్వ్ సెంటర్లను సంజీవనిలో భాగం చేస్తామని సీఎం తెలిపారు. సంజీవని సిటిజన్ వెల్‌నెస్ యాప్ ద్వారా ప్రజలు వైద్యుల అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవడంతో పాటు తమ ఆరోగ్య రికార్డులను ఎప్పుడైనా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేయడం ఒక్కటే సరిపోదని.. ప్రజల్లో కూడా ఆరోగ్య చైతన్యం పెరగాలని సీఎం సూచించారు. మంచి ఆహారం, యోగా, ధ్యానం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన కుటుంబం.. ఆరోగ్యవంతమైన గ్రామం.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

**సంక్షేమం నుంచి సౌర విద్యుత్ వరకు.. ప్రతీ కుటుంబానికి అండగా ప్రభుత్వం..** ప్రజారోగ్యంతో పాటు సంక్షేమానికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందిస్తూ పేదలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని.. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేల సాయం అందిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి మద్దతు, స్త్రీశక్తి ద్వారా మహిళల సాధికారత, దీపం-2.0 ద్వారా గ్యాస్ సబ్సిడీ, ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో గందరగోళం

- 2లో

## పొగాకు సంక్షోభంపై కేంద్రం దృష్టి.. శాశ్వత పరిష్కారానికి సీఎం చంద్రబాబు పట్టు

- పొగాకు రైతుల సమస్యలపై రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం
- తాత్కాలిక ఉపశమనం కాదు, శాశ్వత పరిష్కారం కావాలన్న సీఎం
- రైతులను ఆదుకునేందుకు కేంద్ర బృందం మూడు ప్రతిపాదనలు
- బయ్యర్లతో కేంద్ర మంత్రి పెమ్మసాని చర్చలు.. సోమవారం మరోసారి సమావేశం



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు జరిపిన నిరంతర సంప్రదింపుల ఫలితంగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉన్నతస్థాయి బృందాన్ని రాష్ట్రానికి పంపింది. శనివారం కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరే ముందు ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ భేటీ అయ్యారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు, టొబాకో బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు రూపొందించిన మూడు కీలక ప్రతిపాదనలపై కేంద్ర బృందం సీఎంతో చర్చించింది. వడ్డీ లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి అంశాలు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఈ సందర్భంగా

- 2లో



## ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించం

- ఎర్ర చందనం అక్రమ రవాణాని అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు
- ఆపరేషన్ అరణ్య'పై ఎప్పటికప్పుడు సమీక్షిస్తా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- 2లో

## ఖరీఫ్-2024 పంటల బీమా నిధులు నేరుగా రైతుల ఖాతాల్లోకి : మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి,కలంకౌంటర్ :** వైసీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.1,900 కోట్ల పంటల బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడతలవారీగా చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వానికి హామీ ఇవ్వడంతో ఖరీఫ్-2024 పంటల బీమా బకాయిలను విడుదల చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి రాష్ట్ర రైతుల సమస్యలను వివరించి, పెండింగ్ బీమా నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించిన నేపథ్యంలో కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. కేంద్రం నుంచి ఖరీఫ్-2024 పంటల బీమా నిధులు విడుదలైన వెంటనే అర్హత కలిగిన రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సమస్యలకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ, రైతులకు అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించి బీమా నిధుల విడుదలకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రతి తెలుగు హృదయాన్ని కలిపే సాంస్కృతిక ఉత్సవం "తెలుగు మహోత్సవం": మంత్రి కందుల దుర్గేష్

- జులై 25, 26 తేదీల్లో ఉండవల్లి గుహల వద్ద ఘనంగా వేడుకలు..తెలుగు భాషా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా మహోత్సవ నిర్వహణ
- సాంస్కృతిక సృజనాత్మక సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వినితో కలిసి పోస్టర్ ఆవిష్కరణ
- మాతృభాషా పరిరక్షణకు యువత ముందుకు రావాలి..ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి దుర్గేష్ పిలుపు

**అమరావతి,కలంకౌంటర్ :** మాతృభాష వైభవాన్ని, సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించాలనే ఉన్నతాశయంతో రాష్ట్రస్థాయిలో తెలుగు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జులై 25, 26 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చారిత్రాత్మక ఉండవల్లి గుహల ప్రాంగణంలో జరగనున్న తెలుగు మహోత్సవం అధికారిక పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ .. తెలుగు భాషా వైభవం, సాహిత్య సంపద, సాంస్కృతిక సౌందర్యం, కళా సంప్రదాయాలు, జానపద వారసత్వం మరియు సృజనాత్మకతలను ఒకే వేదికపైకి తెచ్చే అద్భుతమైన వేడుక ఈ తెలుగు మహోత్సవం అన్నారు. మాతృభాషలోని మాధుర్యాన్ని విద్యార్థులు, యువతీ యువకులు ఆస్వాదించేలా, నిత్య జీవితంలో వాడుకలోకి తెచ్చేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ఆధునిక పోకడల్లో తెలుగు భాషా స్వరూపం తగ్గుతోందనే ఆందోళనను అధిగమించి మాతృభాష గొప్పతనాన్ని విశ్వవిఖ్యాతం చేసేందుకు ఈ ఉత్సవం దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న సమయంలో మంత్రి దుర్గేష్ సాహితీ సమరాంగ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన దేశభాషలందు తెలుగు లెస్స అన్న భావంతో కూడిన తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను పద్యాన్ని స్వయంగా ఆలపించి, దాని తాత్పర్యాన్ని వివరించారు. మాతృభాష గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ మహా కార్యంలో విద్యార్థులు, యువత, తెలుగు భాషాభిమానులు, ప్రతి ఒక్కరూ విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.




# గవర్నర్ ని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ



**బాపట్ల,కలంకౌంటర్ :** జిల్లా పర్యటనలో భాగంగా పట్టణంలోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 58వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు శనివారం బాపట్ల పట్టణానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మర్యాదపూర్వకంగా కలసి, పూల మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

# పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా యువశక్తి చైతన్యం అభినందనీయం



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** దేశవ్యాప్తంగా పేపర్ లీకేజీల అంశంపై యువత వ్యక్తం చేసిన ఆందోళనలు, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన శాంతియుత నిరసనలు, విద్యార్థి సంఘాలు, పౌరసమాజ సంస్థలు, వివిధ వర్గాల ప్రజల నుంచి లభించిన మద్దతు పరీక్షల పారదర్శకత, జవాబుదారీతనం, యువత భవిష్యత్తు వంటి కీలక అంశాలపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీశాయని ప్రముఖ సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరిణామాల అనంతరం చోటుచేసుకున్న పరిపాలనా, రాజకీయ నిర్ణయాలు ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయం, రాజ్యాంగబద్ధమైన నిరసనలకు ఉన్న ప్రాధాన్యతను మరోసారి గుర్తు చేశాయని ఆయన అన్నారు. యువత ప్రశ్నించే తత్వం సమాజానికి, దేశానికి ఒక సానుకూల శక్తిగా మారాలని కర్లపాటి ఆకాంక్షించారు. అన్యాయం, అవినీతి, అక్రమాలపై స్పందించడం ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని ఆయన పేర్కొన్నారు. నేటి యువత తమ వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితం కాకుండా, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే పేపర్ లీకేజీల వంటి సమస్యలపై శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా స్వరం వినిపించడం దేశ ప్రజాస్వామ్య సంస్కృతికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రశ్నించడం అంటే వ్యవస్థను వ్యతిరేకించడం కాదని, వ్యవస్థ మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరడమేనని ఆయన స్పష్టం చేశారు. పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, సాంకేతిక భద్రత, జవాబుదారీతనం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని కర్లపాటి సూచించారు. పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల్లో సంపూర్ణ విశ్వాసం కలిగేలా ప్రభుత్వాలు, సంబంధిత సంస్థలు సమర్థమైన సంస్కరణలు అమలు చేయాలని కోరారు.

# 10 కోవిడ్ కేసుల నమోదు

- గుంటూరులో ముగ్గురు.. ఎన్టీఆర్‌లో ఇద్దరికి పాజిటివ్
- రాష్ట్రంలో మొత్తం కేసులు 49..
- ఆసుపత్రుల్లో 24 మందికి చికిత్స



**విజయవాడ, కలంకౌంటర్ :**రాష్ట్రంలో శనివారం పది కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలో ముగ్గురు,ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరు, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కొక్కరికి చొప్పున కోవిడ్ సో కింది. వీటితో కలిపి రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 49కు చేరింది. ఇప్పటివరకు 302 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యారోగ్య శాఖ శనివారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్రంలో నమోదైన మొత్తం కేసుల్లో తూర్పుగోదావరి జిల్లాలోనే అత్యధికంగా 11 ఉన్నాయి. గుంటూరులో తొమ్మిది, వైఎస్సార్ కడప జిల్లాలో ఎనిమిది, విశాఖపట్నంలో ఐదు, ఎన్టీఆర్ జిల్లాలో మూడు కేసులు నమోదయ్యాయి. కాకినాడ, ఏలూరు, బాపట్ల జిల్లాల్లో రెండేసి చొప్పున కేసులు వెలుగుచూశాయి. మరికొన్ని జిల్లాల్లో ఒక్కొక్క కేసు చొప్పున నమోదైంది. కరోనా బాధితుల్లో ప్రస్తుతం 24 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో 16 మంది ఇంటి వద్దనే వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఇప్పటివరకు ఐదుగురు కోలుకుని డిశ్చార్జి అయ్యారు. వీరిలో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ముగ్గురు, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నలుగురు మృతి చెందగా.. వారిలో ముగ్గురు వైఎస్సార్ కడప, ఒకరు కాకినాడ జిల్లాకు చెందినవారు. కొత్త కేసులు నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వ్యాధి నిఘాను వైద్యారోగ్య శాఖ పటిష్ఠం చేసింది. పాజిటివ్‌గా తేలిన వారి ఆరోగ్య పరిస్థితిని గమనించడంతోపాటు వారితో సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించే పనిని జిల్లా సత్వర స్పందన బృందాలు చేపట్టాయి. అనుమానితులకు పరీక్షలు నిర్వహించేందుకు నిర్దేశిత ప్రయోగశాలల్లో ఆర్‌టీ--పీసీఆర్ కిట్లు అందుబాటులో ఉంచారు. అన్ని ద్వితీయ, తృతీయ స్థాయి ఆసుపత్రుల్లో కరోనా బాధితుల కోసం ప్రత్యేక పడకలను సిద్ధం చేశారు. అవసరమైన మందులు, రక్షణ పరికరాలు, పరీక్ష కిట్లు, ఇతర వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. కరోనా సన్నద్ధతపై జూలై 10న అన్ని జిల్లాలను అప్రమత్తం చేసిన వైద్యారోగ్య శాఖ.. జూలై 18న జిల్లా వ్యాధి నిఘా బృందాలతో సమీక్ష నిర్వహించింది. కేసుల గుర్తింపు, పరీక్షలు, బాధితుల పర్యవేక్షణ, ఆసుపత్రుల్లో చికిత్స ఏర్పాట్లపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించింది.

# మీ ఆరోగ్యం... మీ బాధ్యత

- ఆస్పరిలో సంజీవని కార్యక్రమం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించి వివాదాలకు కారణమయ్యారని సీఎం విమర్శించారు. రీసర్వే ద్వారా అన్ని భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరుస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తూ ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని.. వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. హీరో మోటార్స్, ఎల్‌జీ, దాల్మియా వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని.. రూ.1 లక్ష కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను ఉద్యాన, పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కర్నూలు–బళ్లారి రైల్వే లైన్‌కు కేంద్రం ముందుకు రావడం సంతోషకరమన్నారు.

**వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం..** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గిన నేపథ్యంలో రైతులు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జల ధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలు పెంచే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడు ఏళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని తెలిపారు. కర్నూలు జిల్లాలో రూ.1,768 కోట్లతో వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు పైసా ఖర్చు పెట్టలేదని.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని సీఎం విమర్శించారు. ఒక్క ఎకరాకు కొత్తగా నీళ్లు ఇవ్వలేదని.. ఉద్యోగాలు కల్పించలేదని ఆరోపించారు. డ్రిప్ సబ్సిడీలు ఎత్తేసినవారే ఇప్పుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నం పెడుతుంటే గత పాలకులు సహించలేక పోయారని... గత పాలకులు రాష్ట్రంలో ప్రతీ వ్యవస్థను ధ్వంసం చేశారని గుర్తు చేశారు. గొడ్డలి పార్టీ నేతలను.. వారు చేసే మోసపూరిత రాజకీయాలను విశ్వసించ వద్దని ముఖ్యమంత్రి కోరారు.

**పరదాలు కట్టడం లేదు... చెట్లు నరకడం లేదు..** సంజీవని కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభ అనంతరం అదే వేదిక మీద నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా అధికార యంత్రాంగం పనితీరును సమీక్షించారు. శాఖల మంచి పనితీరు కనపరిచిన అధికారులకు అభినందనలు తెలిపారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పం తీసుకుని పనిచేస్తున్నామని క్షేత్ర స్థాయి వరకూ అంతా సమర్ధంగా పనిచేసినప్పుడే ప్రజలకు మేలు చేయగలమని అన్నారు. ఇప్పటి వరకు తాను 50 బహిరంగ సభల్లో ఇదే విధంగా అధికారులు, ఉద్యోగుల పనితీరును ప్రజలకు వివరించానని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా అధికార యంత్రాంగంతో ముఖ్యమంత్రి గ్రూప్ ఫొటో దిగారు. కర్నూలు జిల్లాలోని స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కును అందజేశారు. ప్రసంగిస్తున్న సమయంలో వినతిపత్రాలు ఇచ్చేందుకు కొందరు ప్రయత్నించటంతో సభ ముగిసిన అనంతరం వాటిని తీసుకుంటానని సీఎం వారికి వివరించారు. తాను ప్రజలందరినీ కలుస్తానని.. గత పాలకుల లాగా పరదాలు కట్టుకుని తిరగటం లేదని, చెట్లను నరికించి సమావేశాలు పెట్టటం లేదని సీఎం వ్యాఖ్యానించారు. సీఎం అంటే సచివాలయంలో కూర్చునే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదని.. ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్ అని చెప్పారు. అందుకే ప్రతి నెలా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుంటూ... వాటికి పరిష్కారంగా ప్రజా విధానాలు రూపొందిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు, స్థానిక కూటమి పార్టీల నేతలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించం

- అంతరాష్ట్ర స్మగ్లర్లకు సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పాత్రపై లోతుగా దర్యాప్తు
- ఎర్ర చందనం అక్రమ రవాణాని అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు
- ఆపరేషన్ అరణ్య'పై ఎప్పటికప్పుడు సమీక్షిస్తా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**విజయవాడ,కలంకౌంటర్ :**ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు మరింత కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆపరేషన్ అరణ్య ద్వారా ఎర్ర చందనం స్మగ్లింగ్ ను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. శనివారం, కడప జిల్లా అవధూత కాశినాయన మండల పరిధిలోని వరికుంట్ల గ్రామ సమీపంలోని జ్యోతి గుడి వద్ద రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసిన విషయాన్ని ఉప ముఖ్యమంత్రి కు అధికారులు తెలియచేశారు. ఈ ఘటన పూర్వాపరాలను వివరించారు. శనివారం తెల్లవారుజామున ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, స్టేట్ ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారం ఆధారంగా వరికుంట్ల గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా బొలెరో మ్యాక్స్ ట్రక్కులో ఇంటి సామగ్రి ముసుగులో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న హర్యానాకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, సన్నీ, రమేష్ అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు వివరించారు. విచారణలో జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మల్లికార్జునుడు అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తున్నట్లు గుర్తించామని, వెంటనే అతడిని కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్టు వెల్లడించారు. బెంగళూరు, హర్యానా, కోల్‌కతా ప్రాంతాల్లో వీరికి సహకరిస్తున్న మరికొందరు ప్రధాన సూత్రధారులను గుర్తించినట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆ ప్రధాన సూత్రధారులను పట్టుకోవాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆదేశించారు. బీట్ ఆఫీసర్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్నారు.

# ఆగస్టు 2 జాతీయ జెండా ర్యాలీ విజయవంతం చేద్దాం..

–రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి...

**నూజివీడు/ఏలూరు,కలంకౌంటర్ :** ఆగస్టు రెండో తేదీ జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహించబోతున్న రెండు కిలోమీటర్ల భారీ జాతీయ పతాక ప్రదర్శన ర్యాలీని విజయవంతం చేద్దామని రాష్ట్ర గృహ నిర్మాణ మరియు పౌర సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 150వ జన్మదినం సందర్భంగా జాతీయ జెండా ర్యాలీ కార్యక్రమం నిర్వహించటలపెట్టారు. ఈసందర్భంగా నిర్వాహకులు సచివాలయంలోని ఆయన చాంబర్ వద్ద ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంత్రిచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ జిల్లాలోని అతిపెద్ద జాతీయ జెండా ప్రదర్శనగా ఈ యొక్క కార్యక్రమం ఉండబోతుందని ఇలాంటి కార్యక్రమానికి విద్యార్థులు మేధావులు పౌరులు ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇది ఒక జంగారెడ్డిగూడెం ప్రాంతానికే కాక ఏలూరు జిల్లాకే మంచి కార్యక్రమంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ ఆగస్టు రెండో తేదీన ఉదయం 8 గంటలకు జంగారెడ్డిగూడెం బస్టాండ్ నుంచి అశ్వరావుపేట రోడ్డులోని బాయ్స్ హై స్కూల్ వరకు భారీ జాతీయ జెండా ప్రదర్శన ర్యాలీ నిర్వహించబోతున్నామని దానికి ముందు 29 జూలై ఉదయం 6 గంటలకు పింగళి వెంకయ్య గారి సేవలను స్మరిస్తూ ఒక మారదాం కూడా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొలుసు పార్థసారధిని ముఖ్యఅతిథిగా విచ్చేయాలని కూటమి నాయకులందరు కలిసి వెళ్లి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి ఎంతటి అద్భుతమైన కార్యక్రమానికి




కచ్చితంగా వస్తానని తెలియజేసారని ప్రముఖ విద్య వేత్త దాకారపు కృష్ణ తెలియజేశారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్ర, జెడ్పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, మద్ది ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బొబ్బర రాజుపాల్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కుక్కల మాధవరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఆకుల రాకేష్, పట్టణ బిజెపి అధ్యక్షుడు సుధాకర్, తూటికుంట రాము, సింహాద్రి మొబైల్స్ రాంబాబు, నలకాని చందు, యాతం సుధీర్, ప్రసాద్, పవన్, గోవాడ సత్యనారాయణ, రొంపల్లి శ్రీను, కర్పూరం వెంకన్న బాబు, ఆకుల సురేష్, సోల్సా రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద రహిత వారోత్సవాల ప్రారంభం






**కావలి,కలంకౌంటర్ :** ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తతో ప్రయాణికులకు ప్రాణరక్షణ ఉంటుందని ఆర్టీసీ డిపో మేనేజర్ డి.ఆదినారాయణ పేర్కొన్నారు.ఎపియస్ ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నప్రమాదరహిత వారోత్సవాలను డిపోలో డియం ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆర్టీసీ గ్యారేజ్ నందు నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బందితో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రతీ ఉద్యోగి తన డ్యూటీలో ఇలాంటి ప్రమాదం జరుగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. గ్యారేజ్ సిబ్బంది బస్సు కండిషన్, బ్రేకులు, క్లచ్ ప్రతిరోజు పరిశీలించి, యాంత్రిక లోపాలు లేకుండా శ్రద్ధ వహించాలని అన్నారు. ఎదుటి వాహనం డ్రైవింగ్ బాధ్యతరహితంగా ఉన్నా, మనమే అప్రమత్తతతో ప్రమాదం జరుగకుండా, తద్వారా ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని వివరించారు. ఈ నెల 31వ తేదీ వరకు సిబ్బందికి నిపుణులచే అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. "జీరో ఆక్సిడెంట్ "మన లక్ష్యం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ( ట్రాఫిక్ ) సిహెచ్ శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్ ( మెకానికల్ ) బి. మల్లికార్జున, భద్రతా అధికారి కె .కె రావు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్ కె. తిరుమల రావు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి. రవిప్రకాష్, సిస్టమ్ సూపెర్వైసోర్ టి శివశంకర ప్రసాద్, మెకానికల్ సూపెర్వైసోర్ నజీర్ ఖాన్, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో వ్యవసాయాభివృద్ధికి సహజ వ్యవసాయమే మార్గం - రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్

(మొదటి పేజీ తరువాయి)

శాస్త్రవేత్తలు అధికారులు సిబ్బందిని ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ మరియు ఏ ఎన్ జి ఆర్ ఏ యూ చాన్సులర్ ఎస్ అబ్దుల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పత్తి పెంపక దారుడు ( రిటైర్డ్) కె. రవీంద్రనాథ్ కు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం అదియును వారి చేతుల మీదుగా అందజేయడం చాలా ఆనందంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ మరియు ఏ ఎన్ జి ఆర్ ఏ యూ చాన్సులర్ ఎస్ అబ్దుల్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, ఐ సి ఏ ఆర్ భారతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సంచాలకులు, కళాశాల వైస్ చాన్సులర్ డాక్టర్ పి వి సత్యనారాయణ, కళాశాల ప్రధానోపాధ్యాయులు ప్రసన్న రాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి, బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు,జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు సంక్షోభంపై కేంద్రం దృష్టి.. శాశ్వత పరిష్కారానికి సీఎం చంద్రబాబు పట్టు





(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ఏ నిర్ణయం తీసుకున్నా రైతుల ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. ఏటా ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. "తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలతో ఒక సమగ్రవిధానాన్ని రూపొందించాలి. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. అందరి సమష్టి బాధ్యతతోనే ఇది సాధ్యం" అని ఆయన అభిప్రాయపడ్డారు. పంటను నిల్వ ఉంచుకుని ధరలు స్థిరపడ్డాక అమ్ముకునే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చర్చలను ముందుకు తీసుకెళ్లి, పరిష్కారం కనుగొనాలని కేంద్ర మంత్రి పెమ్మసానికి సూచించారు. సీఎం సూచనల మేరకు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రభుత్వ అధికారులతో కలిసి పొగాకు బయ్యర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని, బయ్యర్లు కూడా సహకరించాలని కోరారు. తదుపరి చర్చల కోసం సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ భేటీలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొని రైతుల కష్టాలను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.

# రిజిస్ట్రేషన్ సేవలు యధాతధం.. బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ శేఖర్ రావు

**బంటుమిల్లి ,కలంకౌంటర్ :** ప్రస్తుతం డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్ నిరసన జరుగుతున్నప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతోందని బంటుమిల్లిసబ్ రిజిస్ట్రార్ శేఖర్ రావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ యధాతథంగా జరుగుతుందని ప్రకటనలో తెలిపారు. ప్రజలు నిర్భయంగా రిజిస్ట్రేషన్ సేవలను ఎలాంటి ఆటంకములు లేకుండా వినియోగించుకోవచ్చునని ఆయన తెలిపారు. డాక్యుమెంటేషన్‌పై సందేహాలుంటే కార్యాలయ సిబ్బంది నివృత్తి చేస్తారని, రిజిస్ట్రేషన్‌కు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎప్పుడు జరిగే మాదిరిగానే రిజిస్టర్ ఆఫీస్ లో అన్ని సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని ఏమైనా మీకు సందేహాలు కలిగినచో ఆఫీసులో వాటిని నివృత్తి చేస్తారని సబ్ రిజిస్టర్ శేఖర్రావు తెలిపారు.



**తిరువూరు శ్రీ వెంకటాచల స్వామి ఆలయం లో తొలి ఏకాదశి సందర్బంగా స్వామి వారికీ విశేష పూజలు.**

–తిరువూరు,కలంకౌంటర్ :

# ఉండవల్లి గుహల్లో తెలుగు మహోత్సవం






**అమరావతి,కలంకౌంటర్ :** తెలుగు మహోత్సవం పేరుతో సృజనాత్మక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు తేజస్వి పొడపాటి ఆధ్వర్యంలో ఉండవల్లి గుహల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ లక్ష్మి షా, మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ శ్రీనివాస్, ఆంధ్రసారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్, డి.జి.పి ఐ.పీ.ఎస్ సరిత, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గద్దె అనురాధ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విల్సన్ ఏ శరత్ చంద్ర మాట్లాడుతూ తెలుగు భాష అంతరించిపోతోంది అని దాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి అని కోరారు. ప్రపంచంలో 80 % దేశాల్లో వారి మాతృభాషలోనే విద్యా బోధన జరుగుతుంది అన్నారు. మన భాష మన సంస్కృతి మన అస్థిత్వం, ఆత్మ గౌరవ పతాక అని అన్నారు. జిల్లా కలెక్టర్ ఒక కవిత రాసుకొచ్చి చదవడం విశేషం. ఉషా పత్రికను కలెక్టర్ లక్ష్మీ షా ఆవిష్కరణ చేశారు.

# వారాహి పూర్ణాహుతి కార్యక్రమానికి పోటెత్తిన భక్తజనం





**చందోలు (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** చందోలు గ్రామంలో గత పది రోజులుగా జరుగుతున్న శ్రీ వారాహి నవరాత్ర మహోత్సవముల పూర్ణాహుతి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి అశేష భక్త ప్రజానీకాలు ఆలయానికి విచ్చేసి మహిషారూట వారాహి అలంకారములో అమ్మవారికి పసుపు కుంకమలో సమర్పించిపూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణము చేసి యాగశాల వద్దకు చేరుకొని పూర్ణహుతీ హోమములు నిర్వహింపజేసి 11 రకాల స్వీట్లు , 11 రకాల పుష్పములు 11 రకాల ఫలములు అగ్నిదేవుడికి ఆహుతిగా సమర్పించారు కార్యక్రమం హోమాన్ని నిర్వహించారు. గుంటూరుకు చెందిన గల్లా సీతారామయ్య దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగినది చందోల ఎస్సై శ్రీ కే మాధవరావు ఆధ్వర్యంలో పోలీసు డిపార్ట్మెంట్ వారుఅవసరమైన చోట్ల బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బందోబస్తు నిర్వహించారని ఈ



కార్యక్రమాలలో సభ్యులు సేవా వాలంటీర్లు పాల్గొన్నారని ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీ కాలకోట చక్రధర్ రెడ్డి తెలియపరిచారు

# రైతు బజార్ పరిశీలించిన మార్కెట్ యార్డ్ చైర్మన్




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నగర పాలక సంస్థ స్వర్ణ వార్డు 45 నందు గల రైతుబజార్ ను మార్కెట్ యార్డ్ చైర్మన్, కుంచె నాని శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, స్వర్ణ వార్డు 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, పి. వి. ఫణి కుమార్, స్వర్ణ వార్డు 50 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, పడమట నాగరాజు, మచిలీపట్నం నగరపాలక సంస్థ లీగల్ న్యాయవాది, పుప్పాల ప్రసాద్, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్, బలి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# నామకరణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణం పెద్ద బజారులో ఉన్న శ్రీ కోదండ రామా కళ్యాణమండపం నందు బంగారు వ్యాపారి చీదెళ్ళ శ్రీనివాసులు మనమరాలు పాదర్తి హేమంత్, తేజస్విని దంపతుల కుమారుడి నామకరణానికి మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు బొకేతో ఘన స్వాగతం పలికారు. చిన్నారిని ఎత్తుకొని ఆశీం-ర్వదించారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి ఫోటో దిగారు. చీదెండ్ల శ్రీనివాసులు కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ ని ఘనంగా సన్మానించారు.అక్కడికి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించారు. అంతకుముందు శ్రీ కోదండ రామాలయంలో కోదండ రాముని దర్శించుకున్నారు. ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు ఎమ్మెల్సీ శ్రీకాంత్ ను శేష వస్త్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ డైరెక్టర్ పోకూరి రాంబాబు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



# సరోజిని దేవి నర్సింగ్ కళాశాలలో భావోద్వేగాల నడుమ ఫేర్‌వెల్




**కందుకూరు,కలంకౌంటర్ :** స్థానిక సరోజిని దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్లో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్, ట్రెజరర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా. కె. శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరై దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, “నర్సింగ్ అనేది ఉద్యోగం మాత్రమే కాదు.. మానవ సేవకు ప్రతీక. సేవాభావం, క్రమశిక్షణ, మానవత్వం ప్రతి నర్సుకు ఆభరణాలు. కళాశాలలో నేర్చుకున్న విలువలతో సమాజంలో ఆదర్శంగా నిలవాలి” అని సూచించారు. ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీ డా. కె. శ్రీకాంత్ మాట్లాడుతూ, “సరోజిని దేవి నర్సింగ్ కళాశాల నాణ్యమైన విద్య, ఆధునిక క్లినికల్ శిక్షణతో సమర్థులైన నర్సులను తీర్చిదిద్దుతోంది. విద్యార్థులు దేశ, విదేశాల్లో రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు, విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలి” అని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. జ్యోతి మాట్లాడుతూ, “ఫేర్‌వెల్ అనేది ముగింపు కాదు.. కొత్త జీవితానికి ఆరంభం. ఇక్కడ నేర్చుకున్న విజ్ఞానం, సేవా దృక్పథం, నైతిక విలువలను జీవితాంతం కొనసాగిస్తూ సమాజానికి సేవ చేయాలి” అని పేర్కొన్నారు. అనంతరం ఫైనల్ ఇయర్ విద్యార్థులు కళాశాల యాజమాన్యం తమకు అందించిన నాణ్యమైన విద్య, ఉత్తమ శిక్షణ, ఆప్యాయతకు గుర్తుగా డా. కె. విజయ్ శ్రీనివాస్, డా. కె. శ్రీకాంత్లకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి. హరిబాబు, డా. జి. ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఫేర్‌వెల్ వేడుకలను విజయవంతం చేశారు.

# నేడు రాష్ట్ర పండుగగా ప్రకట కోటయ్య జయంతి

## చీరాలలో రాష్ట్ర జయంత్యోత్సవం



**చీరాల,కలంకౌంటర్ :** నేడు(ఆదివారం) ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర పండుగగా కూటమి ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వం జీవో కూడా జీవో జారీచేసింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. కోటయ్య రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం బాపట్ల జిల్లాలోని చీరాలలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి ప్రగడ కోటయ్య విశేష సేవలు అందించారు. స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తరవాత కూడా రాష్ట్రంలో చేనేత రంగ పటిష్టతకు ఆయన అలుపెరగని కృషి చేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడి పనిచేసిన ప్రగడ కోటయ్య ఆనాటి చేనేత కార్మికుల కష్టాలను చట్టసభల్లో వినిపించారు. 1952లో తొలిసారిగా మద్రాసు శాసనసభకు ఎంపికై, చీరలు, దోవతులు, చేనేత మగ్గాలపై ఉత్పత్తి చేయాలని ఆనాటి శాసనసభలో తీర్మానం చేయించారు. ఇదే అంశంపై ఆనాటి హైదరాబాద్, ముంబయి, బీహార్ శాసనసభలోనూ చేనేత ఉత్పత్తుల తయారీపై తీర్మానాలను ఆమోదించడం విశేషం. చీరాల సహకార స్పిన్నింగ్ మిల్లు శంకుస్థాపనను ఆనాటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూతో కోటయ్య చేయించారు. 200కు పైగా చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేయించారు. ప్రగడ కోటయ్య కేవలం చేనేత రంగ సమస్యలపైనే కాకుండా రైతుల కోసం, పేదల కోసం కూడా పోరాడారు. చీరాలలో 17 వేల ఎకరాలకు పైగా బంజరు భూములను పేదలకు పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించారు. చేనేత రంగానికి, నేతన్నల అభ్యున్నతికి తన జీవితాన్ని ధారబోసిన ప్రగడ కోటయ్య సేవా స్ఫూర్తి గురించి భావి తరాలకు తెలియజేయలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చీరాలలో జరిగే ప్రగడ కోటయ్య రాష్ట్ర స్థాయి జయంతి కార్యక్రమానికి రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ముఖ్య అతిథి పాల్గొననున్నారని మంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

# కంటైనరులో పశువులు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

## –జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్



**విజయనగరం జిల్లా,కలంకౌంటర్ :** ఒడిస్సా రాష్ట్రం రాయఘడ నుండి కేరళకు ఒక కంటైనర్ వాహనంలో తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి, కంటైనరు వాహనం, 42 పశువులను పెదమానాపురం పోలీసులు జూలై 25న సీజ్ చేసినట్లుగా జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ – పశువుల అక్రమ రవాణాకు పాల్పడినా, అక్రమంగా పశువులను కబేళాలకు తరలించినా, అనధికారంగా పశు మాంసాలను విక్రయించినా ఉపేక్షించేది లేదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ఈ తరహా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. పెదమానాపురం పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఎస్ఐ కళాధర్ మరియు పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టి కంటైనరు వాహనంలో పశువులను తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి, అందులో 42 పశువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహన డ్రైవరు తంగం శశికుమార్ ను అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నామని, పశువులను ఒడిస్సా రాష్ట్రం రాయఘడ నుండి కేరళ రాష్ట్రంకు తరలిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. ఈ కేసులో బాధ్యులైన వ్యక్తులుగా అయ్యప్ప, శంకర్, శేఖర్, భరత్ రాఘవ ఏనాని అనే నలుగురిని గుర్తించామని, వారిని త్వరలో అరెస్టు చేసి, కఠిన చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు.

# అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యేసమీక్ష



**కావలి,కలంకౌంటర్ :** నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శనివారం ఐదు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటీ, విద్యుత్, ఆర్ అండ్ బి శాఖల అధికారులతో సమావేశమై పట్టణంలోని ప్రధాన సమస్యలు, చేపట్టాల్సిన పనులపై సవివరంగా చర్చించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రోడ్ల మరమ్మతులు, స్ట్రీట్ లైట్ల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, ఇరిగేషన్ కాలువల శుభ్రత, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై అధికారులకు పలుసూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులనుఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయాలు, రోడ్ల దెబ్బతినడం, డ్రైనేజీ సమస్యలు ఉంటే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కావలి ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి, విద్యుత్, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి లో తొలి ఏకాదశి సందర్భంగా ఆయా రామాలయాలు విష్ణులయాల్లో జరిగిన ప్రత్యేక పూజలు భక్తులు పాల్గొని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా గీతా పారాయణం జరిగింది మహిళా భక్తులు ఈ గీత పారాయణము నిర్వహించారు. పండుగలు ప్రారంభమయ్యే ముందు తొలి పండగగా తొలి ఏకాదశి నీ నిర్వహిస్తారు.

# లేడీ యాంప్తుల్ లో భోజనశాలకు బండి రామకృష్ణ మూడు లక్షల విరాళం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లాలోని ఏకైక మహిళ ప్రభుత్వ జూనియర్ కళాశాల లేడీ యాంప్తుల్ బాలికల జూనియర్ కళాశాలలో భోజనశాల నిర్మాణం నిమిత్తం కృష్ణా జిల్లా డీ.సీ.ఎం.ఎస్ చైర్మన్ మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ డి సి ఎం ఎస్ నిధుల నుండి కొంత స్వంత నిధులు నుండి కొంత మొత్తం 3 లక్షల రూపాయలు లేడీయాంప్తుల్ కళాశాల లో భోజన శాల నిర్మాణానికి మంజూరు చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, అధికారులు శంకుస్థాపన చేశారు. ఎంతో కాలంగా భోజనశాల లేక ఎండలోనే భోజనాలు వందుతూ మహిళలు విద్యార్థినిలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు కొనకళ్ళ బుల్లయ్య సూచన మేరకు స్పందించిన బండి రామకృష్ణ తక్షణమే నిధులను కేటాయించి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సాధ్యమైనంత త్వరగా బిల్డింగ్ నిర్మాణం పూర్తి చేసి విద్యార్థినిలు అందిస్తామని బండి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ లేడీ యాంప్తుల్ కళాశాల జిల్లాలో అగ్రస్థానంలో ఉందని విద్యా ప్రమాణాలు ఉన్నతంగా పెరిగాయని అదునపు తరగతి గదుల అవసరం ఎంతైనా ఉందని అందుకు ప్రభుత్వం నుండి ఎంపీ ఫండ్స్ నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ కొనకళ్ల బుల్లయ్య జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ జనసేన పార్టీ నాయకులు కొట్టే వెంకట్రావు, గడ్డం రాజు, శివయ్య, పినిశెట్టి వేణు కొండ మేస్త్రి,చంటి, చిరంజీవి, రమేష్, గంపల కృష్ణ గంపల గంగాభవాని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి సరళ కుమారి కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మి ఎన్.ఎస్.ఎస్. అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.





# ముగిసిన వారాహి నవరాత్రోత్సవాలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో గత 11 రోజులుగా నిర్వహిస్తున్న వారాహి నవరాత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి శాంతి పౌష్టిక హోమాలు మహా పూర్ణాహుతి కలశోద్వాసన అభ్రుద స్నానం వేదాశీర్వచనం నిర్వహించారు వేద పండితులు పొక్కునూరి హరనాథ శర్మ అవధాని, జోస్యుల బాలకృష్ణ శర్మ, ఇటికాల చంద్రశేఖర శాస్త్రి, పోతుకూచి ఆంజనేయ కుమార్, తనికెళ్ళ శ్రీనివాస శర్మ చోడవరపు వెంకటేశ్వర శర్మ అవధాని, ఫణి కాశ్యపశర్మ అంబా రవి, కార్తికేయ శర్మ పవన్ లను ఘనంగా సత్కరించారు. ముగింపు సందర్భంగా మధ్యాహ్నం నిర్వహించిన నారాయణ సేవ అన్న సమారాధనలో 3000 మందికి పైగా భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు మామిడి మురలీకృష్ణ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, సామా వెంకట లక్ష్మీ కాంతారావు, బైసాని హయగ్రీవ రావు, ఉడత్తు శ్రీనివాస రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.









# సామూహిక సత్యనారాయణ వ్రతాలు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తొలి ఏకాదశి సందర్భంగా మన మచిలీపట్నం లో వాసవి క్లబ్ ఆద్వర్యంలో స్థానిక బచ్చుపేటలోని భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మండపం నందు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వ్రతముకు కావలసిన పూజ సామాగ్రితో సహా 128 జంటలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు జరిపించారు. అనంతరం అన్న ప్రసాదం వితరణ ఏర్పాటు చేశారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com